సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 9 । నవంబర్ । 2023



ప్రచార రథాలు అదుర్స్ !
అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీలు వినూత్న రీతిలో ప్రచార రథాలను రూపొందించడగా, అవి ఆకట్టుకుంటున్నాయి. IIలో



రేవంత్‌రెడ్డిది రాజకీయ వ్యాపారం
టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రాజకీయాన్ని వ్యాపారం చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. IIలో

గరిష్టం / కనిష్టం
31° / 21°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

బూర్గంపాడు: సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పత్తి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ మద్దతు ధర పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ అలీమ్ కోరారు. బూర్గంపాడు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో బుధవారం సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తక్కువ ధరలకు ప్రైవేటు వ్యాపారులకు అమ్ముకోకుండా సీసీఐ కేంద్రాల్లోనే పత్తిని విక్రయించాలని సూచించారు. ఈ ఏడాది పత్తి క్వింటాకు రూ.7,020 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. తేమ లేకుండా నాణ్యమైన పత్తి తీసుకొస్తే మద్దతు ధర పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ గ్రేడ్ – 3 కార్యదర్శి దుగ్గిరాల నిర్మల, సీసీఐ బయ్యర్ సంజయ్, జిన్నింగ్ మిల్లు నిర్వాహకులు మేడగం రామాంజిరెడ్డి పాల్గొన్నారు.

నేటి నుంచి బొగ్గు నాణ్యతా వారోత్సవాలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా గురువారం నుంచి ఈ నెల 15వ తేదీ వరకు బొగ్గు నాణ్యత వారోత్సవాలు నిర్వహించనున్నారు. దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా పేరున్న సింగరేణి వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును సరఫరా చేస్తోంది. సింగరేణి పరిధిలో ఉత్పత్తి అవుతున్న బొగ్గును దాదాపు 16 రాష్ట్రాల్లోని విద్యుత్, సిమెంట్, స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు అందజేస్తున్నారు. ఆయా పరిశ్రమలు సింగరేణి నుంచి బొగ్గు కూడా ముందుగానే అడ్వాన్స్ బిల్లులు చెల్లిస్తుండటం సంస్థపై నమ్మకాన్ని రుజువు చేస్తోంది. అయినప్పటికీ ప్రస్తుత ప్రపంచంలో ఇతర సంస్థలకు దీటుగా మరింత నాణ్యమైన బొగ్గును సరఫరా చేసేలా వారం పాటు సింగరేణివ్యాప్తంగా కార్మికులకు అవగాహన కల్పించనున్నారు. కాగా, 2022–23 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి వ్యాప్తంగా 666.94 లక్షల టన్నుల బొగ్గును ఉత్పత్తి చేయగా, ఇందులో విద్యుత్ సంస్థలకు 549.69 లక్షల టన్నులు, సిమెంట్, స్పాంజ్ ఐరన్, మందులు, ఎరువులు, పేపర్, సిరామిక్స్ వంటి పరిశ్రమలకు 117.25 లక్షల టన్నులు సరఫరా చేసినట్లు సంస్థ గణాంకాలు చెబుతున్నాయి.

ఇక నామినేషన్ల జోరు..

నేడు, రేపు శుభ ముహూర్తాలు
- భారీగా దాఖలుకు సిద్ధమవుతున్న అభ్యర్థులు
- జిల్లాలో ఇప్పటికే వేసిన 52 మంది..
- అత్యధికంగా కొత్తగూడెం నియోజకవర్గంలో 15 మంది..



కొత్తగూడెంలో నామినేషన్ దాఖలు చేస్తున్న సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు, పక్కన నారాయణ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకోవడంతో గురు, శుక్రవారాల్లో భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలు కానున్నాయి. ముఖ్యంగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఇటీవలే బీ ఫారాలు చేతికి అందాయి. మరోవైపు 9, 10 తేదీల్లో మంచి ముహూర్తాలు ఉండటంతో పెద్ద ఎత్తున నామినేషన్లు వేసేందుకు అభ్యర్థులు సన్నాహాలు చేసుకుంటున్నారు.

ఇప్పటివరకు 52 దాఖలు..
జిల్లాలో ఐదు అసెంబ్లీ స్థానాలు ఉండగా ఇప్పటివరకు 52 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. కొందరు డమ్మీ నామినేషన్లు కూడా వేయడంతో మొత్తం నామినేషన్ సెట్ల సంఖ్య 57గా నమోదైంది. ఇందులో అత్యధికంగా కొత్తగూడెం నియోజకవర్గం నుంచి 15 మంది, అత్యల్పంగా పినపాక నుంచి ఏడుగురు అభ్యరులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు దాఖలైన వాటిలో సగానికి పైగా స్వతంత్ర అభ్యర్థులవే కావడం గమనార్హం.

చిక్కుల్లో పడకుండా..
గత అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్‌తో పాటు జత చేసిన ఎన్నికల అఫిడవిట్‌లో వివరాల నమోదులో తేడాల కారణంగా కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు చిక్కుల్లో పడ్డారు. దీంతో ఈసారి నామినేషన్ల ప్రక్రియపై బీఆర్ఎస్ పార్టీ దృష్టి పెట్టింది. నామినేషన్ల దాఖలుకు రెండు వారాల ముందుగానే అభ్యర్థుల చేతికి బీ ఫారాలను అందజేసింది. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌లలో వివరాలను పొందుపరిచిన తర్వాత ఆయా నామినేషన్ పత్రాలను హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయానికి పంపారు. అక్కడ న్యాయనిపుణులు పరిశీలన చేసిన తర్వాత తిరిగి తమ వద్దకు తెప్పించుకున్నారు. ఈలోగా ప్రతీ అభ్యర్థి ముందుస్తుగా డమ్మీ నామినేషన్లను దాఖలు చేశారు. కాగా గురు, శుక్రవారాల్లో భారీ ర్యాలీలతో రిటర్నింగ్ అధికారి కార్యాలయాలకు వెళ్లి మరోసారి నామినేషన్లు వేయనున్నారు.

నాలుగు స్థానాల్లో కాంగ్రెస్.. ఒకటి సీపీఐ
జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాలకు గాను నాలుగు చోట్ల కాంగ్రెస్ పోటీ చేస్తోంది. కొత్తగూడెం స్థానాన్ని మిత్రపక్షమైన సీపీఐకి కేటాయించింది. మిగిలిన నాలుగు స్థానాల్లో భద్రాచలం అభ్యర్థిగా పొదెం వీరయ్య పేరును తొలి జాబితాలోనే ప్రకటించింది. రెండో జాబితాలో పినపాక అభ్యర్థిగా పాయం వెంకటేశ్వర్లు పేరు ఖరారైనా చాలా రోజుల వరకు బీ ఫామ్ అందజేయలేదు. ఇక రెండు రోజుల క్రితమే ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటించారు. ఆ వెంటనే అందరికీ బీ ఫారాలు అందజేశారు. దీంతో నిన్నా మొన్నటి వరకు టికెట్ దక్కుతుందా లేదా అనే మీమాంసలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు ఇప్పుడు రెట్టించిన ఉత్సాహంతో నామినేషన్లకు సిద్ధమవుతున్నారు. ఓవైపు సొంత పార్టీలో తలెత్తిన అసమ్మతిని చల్లార్చుకుంటూనే ఇతర పార్టీలకు చెందిన అసంతృప్తులను తమవైపునకు ఆకర్షిస్తున్నారు.

ఇప్పటివరకు దాఖలైన నామినేషన్లు..

నియోజకవర్గం	అభ్యర్థులు
పినపాక	07
ఇల్లెందు	13
కొత్తగూడెం	15
అశ్వారావుపేట	09
భద్రాచలం	08
మొత్తం	52

తప్పని 'రెబల్' బెడద !
కొత్తగూడెం అభ్యర్థిగా కూనంనేని సాంబశివరావు బుధవారం భారీ ర్యాలీతో వెళ్లి నామినేషన్ సమర్పించారు. బీఎస్పీ అభ్యర్థులు ఇప్పటికే నామినేషన్ దాఖలు కార్యక్రమాలను పూర్తి చేశారు. ఆఖరున అభ్యర్థులను ప్రకటించిన సీపీఎం, జనసేన అభ్యర్థులు సైతం చివరి రెండు రోజుల్లో నామినేషన్లు దాఖలు చేసేందుకు సమాయత్తం అవుతున్నారు. మరోవైపు ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశించి భంగపడిన ఆశావహులు అసంతృప్తితో రగిలిపోతున్నారు. పార్టీ కోసం ఏళ్ల తరబడి చెమటోడ్చిన తమకు టికెట్ రాకపోవడం అన్యాయమని అంటున్నారు. ప్రధాన పార్టీల తరపున రెబల్‌గా పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

హోరెత్తనున్న ప్రచారం
రెండు రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ పూర్తి కానుండడంతో ఇక ఎన్నికల ప్రచారం హోరెత్తనుంది. ఇప్పటికే సీఎం కేసీఆర్ సభలతో ఇల్లెందు, కొత్తగూడెం నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ తన ప్రచారాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లింది. మిగిలిన నియోజకవర్గాల్లోనూ వచ్చే వారంలో సీఎం సభలు ఉన్నాయి. ఇప్పుడే టికెట్లు ఖరారు కావడంతో కాంగ్రెస్ పార్టీ సైతం ప్రచారాన్ని ఉధృతం చేసే పనిలో ఉంది. ఆ పార్టీ ముఖ్యనేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి రోజుకో నియోజకవర్గంలో తిరుగుతున్నారు. స్టార్ క్యాంపెయినర్లు, జాతీయ నేతల పర్యటన షెడ్యూల్ ఇంకా ఖరారు కావాల్సి ఉంది. బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా కుంచె రంగాకిరణ్ మంగళవారం నియమితులయ్యారు. దీంతో ఆ పార్టీ సైతం భారీ బహిరంగ సభలపై దృష్టి పెడుతోంది.

జంగ్ తెలంగాణ

ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలి

- పార్కులు, బస్టాండ్ సెంటర్లలో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలి
- జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సింగరేణి(కొత్తగూడెం): నూరు శాతం ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పార్కులు, బస్టాండ్లు, రద్దీ ప్రాంతాలల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల సూచించారు. ఓటు హక్కు వినియోగంపై బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఓటు హక్కు వినియోగంపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అందులో బాగంగానే రద్దీ ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ, ఇంజనీరింగ్, వైద్య కళాశాలల్లోనూ ఈ పాయింట్లు ఏర్పాటు చేయాలని స్వీప్ నోడల్ అధికారిని ఆదేశించారు. గతంలో తక్కువగా పోలింగ్ నమోదైన కేంద్రాల్లో ఓటు హక్కు వినియోగంపై కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలని డీపీఆర్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ మధుసూదన్‌రాజు, డీపీఆర్ఓ శ్రీనివాస్, స్వీప్ నోడల్ అధికారి త్రినాథ్‌బాబు, ఎస్సీ అభివృద్ధి అధికారి అనసూర్య, డీసీఓ వెంకటేశ్వర్లు, ఆడిట్ అధికారి వెంకటేశ్వరరెడ్డి, సీపీఓ శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలాన్ని భ్రష్టుపట్టించారు

- కనీసం డంపింగ్ యార్డుకు కూడా స్థలం లేదు
- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు



మాట్లాడుతున్న రాఘవులు, పక్కన తమ్మినేని తదితరులు

భద్రాచలంఅర్బన్ : బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు భద్రాచలం పట్టణాన్ని భ్రష్టు పట్టించారని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో సీపీఎం ఎమ్మెల్యేలు ఉన్నప్పుడే పట్టణం అభివృద్ధి చెందిందని, ప్రస్తుతం భద్రాచలంలో కనీసం డంపింగ్ యార్డుకు కూడా స్థలం లేదని అన్నారు. ఇప్పుడు చెత్తంతా రాములవారి పాదాల వద్దనే వేస్తున్నారని, పాలకుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని చెప్పారు. ఆయా పార్టీలకు ఇప్పుడు ఓట్లడిగే హక్కు లేదన్నారు. రాబోయే రోజుల్లో భద్రాద్రి అభివృద్ధి కోసం సీపీఎం అభ్యర్థి కారం పుల్లయ్యను గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్‌కు బీజేపీ అంటే భయమని, లిక్కర్ స్కామ్‌లో ఆ పార్టీతో రాజీ పడేందుకే ఈ ఎన్నికల్లో ఆయన సీపీఎంతో కలవలేదని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. పొత్తుల కోసం తాము ఎప్పుడూ వెంపర్లాడలేదని అన్నారు. మునుగోడు ఉప ఎన్నిక వరకే బీఆర్ఎస్‌తో పొత్తు అని ఆనాడే చెప్పామని, అయితే కేసీఆర్ తమ ప్రమేయం లేకుండానే భవిష్యత్‌లో కమ్యూనిస్టులతో పొత్తు పెట్టుకుంటామని నాడు చెప్పారని అన్నారు. ఈ ఎన్నికల్లో కనీసం తమతో సంప్రదించకుండానే అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి మాట తప్పారని విమర్శించారు. కాంగ్రెస్‌తోనూ సంప్రదింపుల సందర్భంగా తాము భద్రాచలం స్థానాన్ని అడిగామని, 40 ఏళ్ల పాటు తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇక్కడ ప్రాతినిధ్యం వహించి అభివృద్ధి చేశారని వివరించారు. వచ్చే ఎన్నికల్లోనూ సీపీఎం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నియోజకవర్గ కన్వీనర్ మచ్చా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అభ్యర్థి కారం పుల్లయ్య, మాజీ ఎంపీ మిడియం బాబురావు, సీపీఎం జాతీయ, రాష్ట్ర నాయకులు వెంకట్, పోతినేని సుదర్శన్, బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, ఏజే రమేష్, యలమంచి రవికుమార్, శంకర్‌రావు, రేణుక, ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి, వెంకటరెడ్డి, బండారు శరత్, వై.వి. రామారావు పాల్గొన్నారు.

అవినీతి పాలనను అంతమొందించాలి

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సూపర్‌బజార్(కొత్తగూడెం): నీతికి, అవినీతికి జరుగుతున్న పోరాటంలో అవినీతిని అంతమొందించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పిలుపునిచ్చారు. కాంగ్రెస్, టీజేఎస్, ప్రజాసంఘాలు బలపర్చిన సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు నామినేషన్ సందర్భంగా బుధవారం కొత్తగూడెంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటేననే విషయం ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లోనే బయటపడిందని విమర్శించారు. బీజేపీ సమన్వయకర్తగా వ్యవహరిస్తూ అవినీతిపరులకు కొమ్ము కాసే ప్రయత్నం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావును గెలిపించాలని కోరారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ.. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతం చేద్దామని పిలుపునిచ్చారు. స్థానిక అధికారులు చట్టబద్ధంగా పనిచేసే పరిస్థితి లేదని, ఎమ్మెల్యే వనమా కుటుంబమే దీనికి కారణమని ఆరోపించారు. ఇక్కడ వనమా కుటుంబం, రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం రెండూ ఒకటేనని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రచార కమిటీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కల్వకుంట్ల కుటుంబం అరాచక పాలనను అంతమొందించి ప్రజారంజక పాలన తెచ్చుకుందామని అన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయానికి భారీ ప్రదర్శనగా వెళ్లి కూనంనేని నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, నాయకులు బి.అయోధ్య, రావులపల్లి రాంప్రసాద్, ఎండీ మౌలానా, దండి సురేష్, కాంగ్రెస్ నాయకులు దయానంద్, ఆళ్ల మురళి, సీపీఎం, టీజేఎస్ నాయకులు మల్లెల రామనాథం, జునుమాల నగేష్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు రాజీనామా యోచనలో డీవీ?

- ముగ్గురు కౌన్సిలర్లతో కలిసి పొంగులేటితో మంతనాలు
- నేడో రేపో కాంగ్రెస్ తీర్థం



డీవీతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు తెలిసింది. కొందరు కౌన్సిలర్లతో కలిసి ఆయన టీపీసీసీ కో కన్వీనర్ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో చర్చించారు. ఒకటి, రెండు రోజుల్లో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. డీవీ బాటలోనే మరి కొందరు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పయనమయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ఎమ్మెల్యే హరిప్రియకు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వొద్దన్న వారిలో డీవీ కూడా ఉన్న విషయం తెలిసిందే. అయితే అనంతరం పరిణామాల్లోనూ పార్టీ నాయకులు తనపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని, పొమ్మనలేక పొగ పెడుతున్నారని మథనపడుతున్న ఆయన.. పొంగులేటితో మంతనాలు జరిపినట్లు తెలిసింది.

నేడు తుమ్మల, పొంగులేటి రాక..
మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ఇల్లెందుకు రానున్నారు. మున్సిపల్ చైర్మన్ డీవీని కలిసి పార్టీలోకి ఆహ్వానించనున్నారు. అయితే డీవీ తదితరులు కాంగ్రెస్‌లోకి వెళ్లకుండా ఎమ్మెల్సీ తాతా మధు అడ్డుకుంటున్నట్లు తెలిసింది. ఈ తరుణంలో డీవీ ఇంట పొంగులేటి, తుమ్మల అల్పాహార విందు చేసి, పార్టీలోకి ఆహ్వానిస్తారని సమాచారం. ఇప్పటికే జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య డీవీ ఇంటికి వెళ్లి మంతనాలు జరిపారు.

రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే

టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి



మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

జూలూరుపాడు: రాష్ట్రంలో రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం జూలూరుపాడులో ఆయన పర్యటించారు. వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాళోత్ రాందాస్‌నాయక్, సొసైటీ చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు సర్పంచ్‌లు, ఇద్దరు ఎంపీటీసీలు, ఒక సొసైటీ డైరెక్టర్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నున్నా రంగారావు, పలురువు ముఖ్యనేతలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాందాస్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. డిసెంబర్ 9 సోనియాగాంధీ పుట్టిన రోజున రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమన్నారు. కార్యక్రమంలో ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, నాయకులు బొర్రా రాజశేఖర్, కాళ్లూరు వెంకటేశ్వరరావు, మాళోత్ మంగీలాల్ నాయక్, దుద్దుకూరి మధుసూధన్‌రావు, బొడ్డు కృష్ణయ్య, ముత్తినేని రామయ్య, నున్నా కృష్ణయ్య, చిలుకూరి కృష్ణయ్య, దుద్దుకూరి సుమంత్, బానోత్ లాలు నాయక్, లేళ్ల గోపాల్‌రెడ్డి, సపావట్ నరేష్, ధరావత్ రాంబాబు, కల్యాణపు నరేష్, ఎండపల్లి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత విద్యా సంఖ్య నమోదు చేయించాలి

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్, గురుకుల వంటి అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పర్మనెంట్ ఎడ్యుకేషన్ నంబర్‌ను నమోదు చేయించుకోవాలని డీఈఓ వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల సర్టిఫికెట్, రికార్డు షీట్‌లో ఇది తప్పనిసరని పేర్కొన్నారు. ఈ ఏడాది నుంచి పదో తరగతి పరీక్షల హాల్‌టికెట్, మెమోలపై ఈ సంఖ్య ముద్రిస్తామని తెలిపారు. అన్ని యాజమాన్యాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, విద్యార్థుల తల్లిదండ్రులు గమనించి విద్యార్థులకు శాశ్వత విద్యా సంఖ్య ఉండేలా చూడాలని కోరారు.

రూ.2.23 లక్షల నగదు సీజ్

అశ్వారావుపేటలో రూ.1.50 లక్షలు..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట సరిహద్దు చెక్‌పోస్టు వద్ద బుధవారం పోలీసులు రూ.1.50 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏపీలోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం అప్పలరాజుగూడేనికి చెందిన కాటేపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి కారులో సరైన ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపారు.

కూనవరం రోడ్డులో రూ.73 వేలు..

భద్రాచలంఅర్బన్: ఆధారాలు లేకుండా ఓ వాహనంలో తరలిస్తున్న రూ.73 వేల నగదును బుధవారం పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న చెక్ పోస్టు వద్ద పోలీసులు పట్టుకున్నారు. సరైన రశీదులు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు.

మద్యం స్వాధీనం



సీజ్ చేసిన మద్యం సీసాలతో పోలీసులు

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో భారీగా మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని మల్లారం రోడ్డు వద్ద ఎఫ్ఎస్ టీం తనిఖీలు చేస్తున్న క్రమంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 236 క్వార్టర్ మద్యం సీసాలను గుర్తించారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, సీజ్ చేశామని టీం హెడ్ కృష్ణ తెలిపారు.

కామేపల్లిలో రూ.6 వేల విలువైన ...

కామేపల్లి: మండలంలోని మద్దులపల్లికి చెందిన షేక్ మహిబ్‌కు చెందిన బెల్ట్ షాపులో అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా రూ.6 వేల విలువైన 33 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

ప్రచార రథాలు అదుర్స్!

ప్రత్యేక ఆకర్షణగా అభ్యర్థుల ప్రచార వాహనాలు

- చిలకలూరిపేట, హైదరాబాద్‌లో ముస్తాబు
- జనరేటర్, లైట్లు, మైక్‌సెట్లతో పాటు ప్రత్యేకంగా డయాస్
- ఒక్కో వాహనానికి రూ.4 లక్షలకు పైగానే వ్యయం



చుంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలై ప్రస్తుతం నామినేషన్ల ఘట్టం నడుస్తోంది. ఇప్పటికే ప్రధాన పార్టీలన్నీ ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులను ఖరారు చేశాయి. వారందరూ ఇక ఊరూరా ప్రచార పర్వంలోకి దిగనున్నారు. సమయం తక్కువగా ఉండటంతో ఇప్పటి వరకు చేస్తున్న ఇంటింటి ప్రచారం కాస్త ఇక నుంచి రథమెక్కనుంది. ఎన్నికలు ఏవైనా ముందుగా గుర్తుకు వచ్చేది ప్రచారమే.. ఓటర్లను అన్ని రకాలుగా ఆకర్షించేందుకు అభ్యర్థులు ఎవరి శైలిలో వారు ప్రచారం సాగిస్తుంటారు. ఈ ప్రచార ఘట్టంలో ప్రధాన భూమిక పోషించేవి ప్రచార రథాలే. అందుకే చూడగానే ఆకట్టుకునేలా అభ్యర్థులు పోటాపోటీగా వీటిని సిద్ధం చేసుకుంటున్నారు. ఇప్పటికే అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీలు అభ్యర్థులను ప్రకటించడంతో అక్కడక్కడా ఇంటింటి ప్రచారం షురూ చేశారు.

నామినేషన్ల అనంతరం ఊరూవాడ, పల్లేపట్టణం అనే తేడా లేకుండా ప్రచారం ఊపందుకోనుంది. ప్రచారం సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ పార్టీల జెండాలు రెపరెపలాడబోతున్నాయి. మైకుల మోతలతో ప్రచారం హోరెత్తనుంది. తక్కువ సమయంలో ఎక్కువ ప్రాంతాలను చుట్టిరావాలంటే ఏ పార్టీకైనా ప్రచార రథాలే కీలకం. అందుకే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచార రథాలను సిద్ధం చేసుకొని రంగంలోకి దిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు.



ప్రత్యేక హంగుల కోసం భారీగా ఖర్చు



ప్రచార వాహనంపై వక్తల కోసం డయాస్ (ఇన్‌సెట్) మినీ జనరేటర్



అమర్చిన ఎల్ఈడీ లైట్లు, మైక్‌లు

తమ తమ నియోజకవర్గాల పరిధిలో ఓటర్లను ఆకట్టుకునేలా అభ్యర్థులు ప్రచార పర్వానికి సిద్ధమవుతున్నారు. ఇందుకోసం అభ్యర్థులు ఆకర్షణీయమైన ప్రచార రథాలను వినియోగించనున్నారు. టెక్నాలజీ పెరగడంతో ఈ రథాల రూపురేఖలు కొత్తపుంతలు తొక్కుతున్నాయి. కొత్తగా డిజిటల్ ఫ్లెక్సీలను ప్రచార రథాలకు అమరచ్చారు. ప్రధాన పార్టీలు, చిన్న పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు వీటిని సిద్ధం చేయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిలకలూరిపేటతోపాటు హైదరాబాద్‌లోని నాంపల్లి, అంబర్‌పేట వంటి ప్రాంతాల్లో వీటిని ముస్తాబు చేసి తెప్పిస్తున్నారు. అభ్యర్థుల అభిరుచులకు తగ్గట్టుగా అశోక్‌లేలాండ్, టాటా ఏస్, డీసీఎం గూడ్స్ ఆటోలకు సరికొత్త హంగులను జోడించి ప్రచార రథాలుగా మార్చారు. పార్టీ గుర్తులు, సంక్షేమ పథకాలు, నాయకుల పేర్లు డిజిటల్ ఫ్లెక్సీలతో కనిపించేలా వాహనాలను తీర్చిదిద్దారు.

ప్రస్తుతం ట్రెండ్‌కు తగ్గట్టు ప్రచారరథం పైకి ఎక్కితే సకల సౌకర్యాలు ఉండేలా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇక ప్రచారం వాహనానికి మినీ జనరేటర్, 250 వాట్ల మైక్‌లు, రథానికి నాయకుల చిత్రపటాలు, కార్డులెస్ మైకు, కార్డుతో కూడిన మైకు రథం పై ఐదు నుంచి పది మంది ముఖ్యులు నిల్చొనేలా డయాస్, టైటిల్స్, చుట్టూ రెయిలింగ్స్, వాటర్‌ప్రూఫ్ కార్పెట్లు, పైన నిలబడి మాట్లాడే నాయకుడు కనిపించేలా 8వరకు ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. తమ పార్టీల అధినేతల ఫొటోలు, గుర్తులతో ఆకర్షించేలా రథాలను తయారు చేయించుకున్నారు. ఒక్కో అభ్యర్థి ప్రచారం కోసం రెండు, మూడు వాహనాలను ఏర్పాటు చేసుకున్నారు. ప్రచార రథాల ప్రత్యేక అలంకరణ విషయంలో అభ్యర్థులు ఖర్చు వెనకాడకుండా ఎంతంటే అంత ఖర్చు చేస్తున్నారు. ఒక్కొక్క ప్రచార రథం తయారు చేయడానికి రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఖర్చు అయినట్లు బరిలో ఉన్న అభ్యర్థులు పేర్కొంటున్నారు.

వాహనాలకు జీపీఎస్, సీసీ కెమెరాలు



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యాన ఎన్నికల సంఘం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఈక్రమంలో ఈసారి అడుగు ముందుకేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తోంది. జిల్లాలోని నియోజకవర్గాల్లో అక్రమాలను అరికట్టేందుకు మూడు షిఫ్ట్‌ల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్ (ఎఫ్ఎస్‌టీ)లు పర్యవేక్షిస్తున్నాయి. వీరికి కేటాయించిన వాహనాలకు ముందుగానే జీపీఎస్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. తద్వారా వాహనాలు ఏ మార్గంలో వెళ్తున్నాయి, ఎక్కడ ఎక్కువ సేపు ఆగాయనేది ఉన్నతాధికారులు తెలుసుకునే వీలు కలిగింది. ఇప్పుడు అదే వాహనాల పైభాగంలో 360 డిగ్రీల సీసీ కెమెరా ఏర్పాటు చేశారు. తద్వారా ప్రతీ దృశ్యం రికార్డు అవుతుండగా... కంట్రోల్ రూమ్‌కు పుటేజీని అనుసంధానం చేశారు. దీంతో తనిఖీల సమయంలో అక్రమాలు జరగకుండా.. నగదుతో వెళ్తూ పట్టుబడిన తప్పించుకోకుండా ఈ కెమెరాలు ఉపయోగపడుతున్నాయి.

– ఖమ్మం సహకారనగర్

నాకు అందరూ సమానమే !





పక్షుల నుంచి పంటలను కాపాడుకునేందుకు దిష్టిబొమ్మలు, జెండాలను రైతులు ఏర్పాటుచేయడం మనకు తెలిసిందే! ఇప్పుడు ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతుండడంతో వివిధ పార్టీల నాయకులు ఎక్కడపడితే అక్కడ జెండాలను కడుతున్నారు. దీంతో ఇల్లెందు మండలం పోచారంతండా గ్రామానికి చెందిన రైతు వినూత్నంగా ఆలోచించాడు. గ్రామంలో ఎగురుతున్న పార్టీల జెండాలను తన మిర్చి చేనులో ఏర్పాటుచేశాడు. ఏదో ఒక పార్టీ జెండా ఏర్పాటుచేస్తే ఆ పార్టీ అనుచరుడిగా ముద్ర వేస్తారని అనుకున్నాడో ఏమో కానీ అందరూ సమానమేనని చాటేలా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సహా ప్రజాపంథా పార్టీ జెండాలను కూడా ఏర్పాటు చేయడం ఆకట్టుకుంటోంది.

– ఇల్లెందురూరల్

జంగ్ తెలంగాణ

క్లుప్తంగా

వైద్యసేవలపై రాష్ట్ర బృందం ఆరా..



వైద్యసిబ్బందితో రాష్ట్ర మాతా శిశు సంరక్షణ బృందం

బూర్గంపాడు: మండల పరిధిలోని మోరంపల్లిబంజర పీహెచ్‌సీని రాష్ట్ర మాతా శిశు సంరక్షణ బృందం బుధవారం సందర్శించింది. ఆస్పత్రిలో గర్భిణులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కాన్పులు, ప్రభుత్వం అందిస్తున్న పథకాల తీరుతెన్నులను తెలుసుకున్నారు. తల్లి, బిడ్డల మరణాల రేటును పూర్తిగా తగ్గించాలని సూచించారు. రాష్ట్ర మాతా శిశు సంరక్షణ బృందం సభ్యులు డాక్టర్ అఖిల, డాక్టర్ కీర్తి, డాక్టర్ చైతన్య, డాక్టర్ లక్ష్మీసాహితి, డీపీఓ దుర్గ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారులపై దాడి

టేకులపల్లి: విధులు నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులపై దాడి చేసి విధులకు ఆటంకం కలిగించిన ఘటనపై టేకులపల్లి పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. బొమ్మనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తతండా(పి) గ్రామానికి చెందిన బోడ వీరన్ కుమార్ ఏడాది నుంచి విద్యుత్ బకాయి రూ.9,800 చెల్లించడం లేదు. గత నెల 31న ఉదయం వీరన్ ఇంటికి విద్యుత్ శాఖకు చెందిన లైన్ ఇన్‌స్పెక్టర్ నాగుల్ మీరా, జేఎల్ఎం దామర చరణ్, ఎలక్ట్రీషియన్ గోపి వెళ్లి బకాయి చెల్లించాలని కోరగా, ఆయన చెల్లించేందుకు నిరాకరించాడు. ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి విద్యుత్ సర్వీసును తొలగిస్తుండగా వీరన్ అధికారులను బూతులు తిడుతూ, దాడికి పాల్పడి, విధులకు ఆటంకం కలిగించాడు. ఈ ఘటనపై బుధవారం జేఎల్ఎం ఫిర్యాదు చేయగా, ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన కారు



ప్రమాదంలో దెబ్బతిన్న కారు

పాల్వంచ: డివైడర్‌ను కారు ఢీకొట్టిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. భద్రాచలం వైపు నుంచి పాల్వంచ వైపు వస్తున్న కారు జగన్నాథపురం సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో కారులోని వ్యక్తులకు స్వల్పగాయాలయ్యాయి. కారులో ఉన్న వారు ఇల్లెందుకు చెందిన వారుగా తెలిసింది. కారు ధ్వంసమైంది. సరైన సూచికలు లేక పోవడంతోనే డివైడర్‌ను కారు ఢీకొట్టిందని, ఇటీవల కాలంలో ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయని స్థానికులు పేర్కొంటున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,196

రేవంత్‌రెడ్డిది రాజకీయ వ్యాపారం

- టికెట్లు అమ్ముకుని మోసం చేశాడు
- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న తాటి వెంకటేశ్వర్లు

అశ్వారావుపేట: టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి రాజకీయాన్ని వ్యాపారం చేసే ముఠాకు బాస్‌గా మారారని మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు ఆరోపించారు. బుధవారం ఆయన అశ్వారావుపేటలో విలేకరులతో మాట్లాడారు. ఈ నియోజకవర్గంలో రెండేళ్ల క్రితం వరకు కాంగ్రెస్ కష్టకాలంలో ఉండగా ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆహ్వానం మేరకు తాను కాంగ్రెస్‌లో చేరానని, నాటి నుంచి కష్టపడి పార్టీని బలోపేతం చేశానని చెప్పారు. తన సేవలకు మెచ్చి టీపీసీసీ జనరల్ సెక్రటరీ పదవి ఇచ్చారని, ఆదివాసీల సమస్యలు, పోడు పట్టాల సమస్యలపై ఉద్యమించి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లానని తెలిపారు. అయితే కొందరు రాజకీయ వ్యాపారవేత్తలు, బడా నాయకులు చీకటి ఒప్పందాలతో అశ్వారావుపేట కాంగ్రెస్ టికెట్‌ను కనీస అవగాహన లేనివారికి అమ్ముకున్నారని ఆరోపించారు. తన కంటే పార్టీలో సీనియర్లు అయిన సున్నం నాగమణి, వగ్గెల పూజ పార్టీ అభ్యున్నతి కోసం ఎంతో శ్రమించారని, కనీసం వారికి కూడా టికెట్ ఇవ్వలేదని విమర్శించారు. ఏ సర్వే ప్రకారం అశ్వారావుపేట టికెట్ ఆదినారాయణకు ఇచ్చారని ప్రశ్నించారు. గాంధీభవన్ కేంద్రంగా రేవంత్‌రెడ్డి దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని, రాహుల్, సోనియా, ప్రియాంక గాంధీ స్పందించి తెలంగాణలో జరుగుతున్న రాజకీయ వ్యాపారాన్ని అడ్డుకోకుంటే నష్టపోవడం ఖాయమని హెచ్చరించారు. ఈ నీచ రాజకీయాలు భరించలేకే కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశానని, తనతో కలిసొచ్చేవారితో చర్చించి తదుపరి నిర్ణయం వెల్లడిస్తానని చెప్పారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా 100 శాతం రాజకీయ వ్యాపారేనని ఆరోపించారు. 2014లో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన ముగ్గురు గిరిజన ఎమ్మెల్యేలను బయట కూర్చోబెట్టి కేటీఆర్‌తో ఆయన పదవుల బేరాలు మాట్లాడుకునే వారని, ఇది తెలిసిన ఒక సభ్యుడు ముందుగానే టీఆర్ఎస్‌లో చేరారని, తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవి ఇచ్చిన తర్వాత తాను టీఆర్ఎస్‌లోకి వెళ్లానని వివరించారు. సమావేశంలో తాటి అనుచరులు పొట్టా రాజులు, రామకృష్ణ, రవి, కృపాకర్, నాగరాజు, రమేష్, అజీం, రాజు పాల్గొన్నారు.

13న బీఆర్ఎస్‌లోకి..

దమ్మపేట : ఈనెల 13న దమ్మపేటలో కేసీఆర్ నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభలో సీఎం సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు తెలిపారు. డబ్బు అహంకారం ముందు నిజాయితీ ఓడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం దమ్మపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌లో తనకు జరిగిన అన్యాయం గురించి వివరించారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నమ్మించి మోసం చేశారని ఆరోపించారు. తనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా పార్టీకి సంబంధం లేని వ్యక్తులకు టికెట్ ఇవ్వడం అవమానంగా భావించి పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. సమావేశంలో తాటి అనుచరులు దోసపాటి రాంబాబు, చెరుకూరి రవి, సంక కృపాకర్, బూరుగుపల్లి కృష్ణ, రామకృష్ణ, అజీమ్, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టీబీజీకేఎస్‌తో సింగరేణి మనుగడ ప్రశ్నార్థకం

- బీఆర్ఎస్‌ను ఓడించి బుద్ధి చెప్పాలి
- ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత వాసిరెడ్డి సీతారామయ్య

మణుగూరు టౌన్: రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం, ఆ పార్టీ అనుబంధ సంస్థ టీబీజీకేఎస్ వచ్చాక సింగరేణి మనుగడ ప్రశ్నార్థకంగా మారిందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య విమర్శించారు. బుధవారం పీవీకాలనీలోని కార్యాలయంలో బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ అధ్యక్షతన జరిగిన బ్రాంచి కౌన్సిల్ సమావేశంలో జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. భూగర్భ గనులు, ఓసీలు రాకపోవడం తోపాటు ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి బకాయి రూ.29 వేల కోట్లను చెల్లించకపోవడంతో కొత్త ఉపరితల గనులు రావడం లేదని అన్నారు. సింగరేణిలో రాజకీయ జోక్యం అధికమై అవినీతి పెరిగిపోయిందని, దీని ద్వారా కార్మికుల సంఖ్య తగ్గిపోతోందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో పటిష్టమైన నాయకత్వం అవసరం ఉందని తెలిపారు. రానున్న గుర్తింపు సంఘం ఎన్నికలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

హామీలు అమలు చేయని సీఎం కేసీఆర్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కార్మికులకు, ప్రజానీకానికి సీఎం కేసీఆర్ చెప్పిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ప్రతి ఇంట్లో డిగ్రీలు, పీజీలు చదివిన పిల్లలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రూ. లక్షా నలభై వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్ట్ కడితే నాలుగేళ్లకే మూలనపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మిగులు ఆదాయం ఉన్న తెలంగాణను అప్పుల తెలంగాణను మార్చారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన బీఆర్ఎస్‌ను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించి బుద్ధి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో నాయకులు రామనర్సయ్య, ఈశ్వర్, ఆవుల నాగరాజు, సురేందర్, సుభాని, పిట్ సెక్రటరీలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, కౌన్సిల్ మెంబర్లు, కార్మికులు పాల్గొన్నారు.

చోరీ కేసు నమోదు

దుమ్ముగూడెం : లిఫ్ట్ ఇరిగేషన్‌కు చెందిన మోటార్ ప్యానల్ బోర్డు చోరీపై ఎస్ఐ కేశవరావు బుధవారం కేసు నమోదు చేశారు. మండలంలోని సంగెం గ్రామ శివారులో చిన్న గుబ్బలమంగి వాగు ఒడ్డున శిథిలమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఉంది. లిఫ్టునకు సంబంధించిన మోటార్ ప్యానెల్ బోర్డ్ బాక్స్‌ను చోరీకి గురైంది. దీంతో పెద్దనల్లబల్లి గ్రామ సర్పంచ్ మట్టా వెంకటేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు సురేందర్



మాట్లాడుతున్న దండు సురేందర్

అశ్వాపురం: నవంబర్‌లో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని మాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్, రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ కోరారు. మండల కేంద్రంలో బుధవారం జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చి తొమ్మిది ఏళ్లు గడుస్తున్నా బిల్లు ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూలమని చెబుతున్న బీఆర్ఎస్.. తమ ఎంపీలతో ప్రైవేటు బిల్లు కూడా పెట్టించలేదన్నారు. మాయమాటలు చెప్పే ప్రధాన పార్టీల పట్ల మాదిగలు జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర యువసేన అధ్యక్షుడు గొల్లపల్లి నరేష్, నాయకులు చుంచు ప్రవీణ్, పేరాల దుర్గాప్రసాద్, ఇసంపల్లి లింగన్న, గొల్లపల్లి రాంబాబు, బొడ్డు శ్రీకాంత్, కొప్పుల ఆదిత్య, చుంచు విజయ్, ఏడుకొండలు, కొమ్ము రాజు, సైదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యంతో ఆర్ఐ

దుమ్ముగూడెం : బొలెరో వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీల క్రమంలో వాహనం ఆపకుండా వెళ్లగా అధికారులు వెంబడించి కొత్తపల్లి శివారులో పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బియ్యం తరలిస్తున్న చింతూరు మండల మోతుగూడెం గ్రామానికి చెందిన దార బాబూరావు, వాహన డ్రైవర్ అమర మహేంద్రలపై 6ఏ కేసు నమోదు చేశామని సివిల్ సప్లై శాఖ ఆర్ఐ శ్రీరామ్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యాన్ని భద్రాచలంలోని జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. కాగా తన విధులకు ఆటంకం కలిగించారని ఆర్ఐ శ్రీరామ్ ఫిర్యాదు చేయగా, నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కేశవరావు తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: అదనపు కట్నం కోసం భార్యను వేధిస్తున్న భర్తతోపాటు, అతని కుటుంబ సభ్యులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తనను భర్త కార్తీక్‌తోపాటు మరో ముగ్గురు బంధువులు, కుటుంబ సభ్యులు వేధిస్తున్నారని స్టేషన్ బస్తీకి చెందిన సౌమ్య ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవూఫ్ తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మణుగూరు టౌన్: మండలంలోని రామానుజవరం పంచాయతీలో ఓ వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మణుగూరులో బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వట్టే ప్రసాద్, నాగలక్ష్మి(23) దంపతులు సమీపంలోని శివాలయంలో గో శాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పది రోజుల క్రితం దంపతుల మధ్య గొడవ జరగ్గా మనస్తాపం చెందిన నాగలక్ష్మి బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులను సంప్రదించగా.. ఇంకా కేసు నమోదు కాలేదని తెలిపారు.

ప్లాట్‌ఫామ్, రైలుకు మధ్య ఇరుక్కుపోయి..

యువకుడికి తీవ్రగాయాలు



ప్లాట్‌ఫామ్ మధ్య నుంచి బయటకు తీశాక లోకేష్



రైలుకు ప్లాట్‌ఫామ్‌కు మధ్యలో ఇరుక్కుపోయిన యువకుడు

మణుగూరు టౌన్: ఆగబోతున్న రైలు నుంచి దిగుతున్న క్రమంలో కాలుజారి రైలుకు, ప్లాట్‌ఫామ్‌కు మధ్యలో ఇరుక్కుపోయి ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మణుగూరు రైల్వేస్టేషన్‌లో బుధవారం జరిగింది. ప్రయాణికుల కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన ప్రగళ్ల లోకేష్ హైదరాబాద్‌లో ఉంటూ జీవినం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో శుభకార్యం నిమిత్తం హైదరాబాద్ సూపర్‌ఫాస్ట్‌లో వచ్చిన అతను బుధవారం ఉదయం మణుగూరులో రైలు దిగే క్రమంలో ప్రమాదానికి గురయ్యాడు. దీంతో రెండు కాళ్లు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. క్షతగాత్రుడు ఆర్తనాదాలు చేస్తుండగా తోటి ప్రయాణికులు బయటకు తీసి, 108 ద్వారా మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి భద్రాచలం తీసుకెళ్లారు.



పెళ్లి సంబంధం కుదరగానే వారి వారి స్థోమత మేరకు పెళ్లి ఎంత గ్రాండ్‌గా చేయాలనే ఆలోచన చేస్తుంటారు పెద్దవాళ్లు. పెళ్లిలో కాబోయే అత్తగారి డిమాండ్ మేరకు వధువు అమ్మానాన్నలు నడుచుకుంటూ ఉంటారు. ఇందులో భాగంగా ఇటీవల మరో కొత్త డిమాండ్ కూడా వచ్చి చేరింది. కాబోయే పెళ్లికూతురు వివాహ వేడుకలో దేదీప్యమానంగా వెలిగిపోవాలి. అందరూ 'అందమైన కోడలిని సెలెక్ట్ చేసుకున్నారు అనే కితాబులు అందుకోవాలి. అందుకు, ఏ చికిత్స చేయించుకున్నా సరే!' అంటున్నారు. మరి, కాబోయే వధువులు వేడుకకు సిద్ధం కావడానికి ఎలాంటి కేర్ తీసుకుంటున్నారు. ఈ క్రమంలో అందం పట్ల తీసుకుంటున్న చికిత్సలు.. వికటిస్తున్న పరిమాణాలు ఏమిటి? భేష్ అనదగిన విధానాలేమిటి? అనే విషయాలపై తప్పనిసరిగా దృష్టి పెట్టాలి.

ఆపరేషన్ బ్యూటీ

పెళ్లి సంబంధాల్లో 'కొత్త' డిమాండ్

''ఓ మల్టీనేషనల్ కంపెనీలో పనిచేస్తున్న సుష్మ పెళ్లి వచ్చే డిసెంబర్‌లో జరగనుంది. పెళ్లి ఫిక్స్ అయ్యాక అత్తగారు నవ్వుతూ – 'అమ్మాయీ, నీ వంటి రంగు బ్రైట్ చేయించుకో. ఫెయిర్ నెస్ కోసం ఇంజెక్షన్లు మార్కెట్‌లో దొరుకుతాయని విన్నాను. వాటిని ట్రై చేయి. ఏ ట్రీట్‌మెంట్ అయినా తీసుకో. కానీ, పెళ్లి టైమ్‌కి అందంగా తయారవ్వాలి' అని ఆర్డర్ వేసింది. ఆమె తన కోడలు పందిట్లో చందమామలా కనిపించాలని, కోడలు మొహం చూసి బంధుమిత్రులంతా నిశ్చేష్టులవ్వాలని కోరుకుంటుంది. 'అత్తగారి డిమాండ్ ఇప్పుడు నాకు ఆందోళన కలిగిస్తోంది' అంటోంది సుష్మ. ఇందుకోసం బ్యూటీ ట్రీట్‌మెంట్స్‌తో పాటు చర్మ ఛాయలో కూడా తేడా వచ్చేలా మార్పులు చేసుకోవడానికి తెగ కష్టపడుతోంది. 'పెళ్లి అంటేనే ఎంతో ఉత్సాహం. ఫొటోల్లో, వీడియోల్లో బాగా కనిపించాలని, అందరిలో ప్రత్యేకంగా వెలిగిపోవాలని నాకూ ఉంటుంది. ఇందుకు బ్యూటీ పార్లర్స్‌కి వెళ్లడం, మేకప్ చేయించుకోవడం సాధారణంగా జరుగుతుంటుంది. కానీ, ఇప్పుడు ప్రత్యేకంగా ట్రీట్‌మెంట్స్ కూడా చేయించుకోవాల్సి వస్తోంది. పెళ్లి ఖర్చులే కాకుండా ఈ కొత్త తరహా ఖరీదైన ఖర్చు తలనొప్పిగా మారింది అంటున్నారు అమ్మనాన్నలు' అని బాధపడుతోంది సుష్మ.

★ ★ ★

కాబోయే అత్తగారు కోరడంతో రూప (పేరు మార్చడమైంది) తన కంటి కింది భాగం లోతుగా ఉండటం వల్ల 'అండర్ ఐ ఫిల్లర్' ఇంజక్షన్ చేయించుకుంది. దీంతో కంటి కింది భాగంలో రక్తం గడ్డకట్టి, వాపు వచ్చి, బయటకు రాలేని పరిస్థితి. త్వరలో పెళ్లి. ఆ క్లాట్ అంత తొందరగా తగ్గదు. దిక్కుతోచని పరిస్థితి.

★ ★ ★

శిల్ప అందం కోసం బొటాక్స్ ట్రీట్‌మెంట్ చేయించుకుంది. డోస్ ఎక్కువ మోతాదులో ఇవ్వడం వల్ల ముఖంలో ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వడానికి వీలు లేకుండా మారిపోయింది.

★ ★ ★

అందం పెంచుకునే విషయంలో ఒకరో ఇద్దరు కాదు అమ్మాయిలు ఎప్పుడూ తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు. ఇక పెళ్లి అంటే చెప్పనక్కర్లేదు. ప్రీ వెడ్డింగ్ షూట్ నుంచి ప్రతి సంబరాన్నీ పదిలపరుచుకోవడానికి ఎన్నో పాట్లు పడతారు. దీంట్లో భాగంగా బ్యూటీ కాన్షియస్ అమ్మాయిల్లోనూ, అబ్బాయిల్లోనూ పెరిగింది. ఈ విషయంలో ఎలాంటి చికిత్స, జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకోవడం మంచిది అంటున్నారు డెర్మటాలజిస్ట్ డాక్టర్ స్వప్న ప్రియ. వాటిలో...

ఇంట్లో ప్రయోగాలు..

చాలా మంది అందానికి ఇంటి చిట్కాలు పాటిస్తుంటారు. సహజంగా లభించే వాటితో బ్యూటీప్యాక్‌లు వేసుకుంటూ ఉంటారు. వాటి ద్వారా ఎంత సమయంలో ఎంత ప్రయోజనం ఉంటుందో కూడా చూడాలి. ఎందుకంటే, కొంతమందికి స్కార్స్, పింపుల్స్, యాక్నె, డల్ స్కిన్, కలర్ ఛేంజ్, చుండ్రు... ఇలా చాలా సమస్యలు ఎదుర్కొంటూ ఉంటారు. వాటికి చికిత్సనే సరైన మార్గం. ఆహారానికి సంబంధించినవి తప్పనిసరిగా పెళ్లికి రెండు నుంచి మూడు నెలల ముందు మార్పులు చేసుకోవాలి. సహజంగా చర్మంలో మార్పులు రావాలంటే పోషకాహారం మంచి ఎంపిక. అప్పుడే మంచి ఫలితం ఉంటుంది.

బ్యూటీ స్పాలో చికిత్స మంచిదేనా?

స్కిన్ టైటనింగ్, రింకిల్స్, స్కిన్ హైడ్రేషన్.. వంటి ట్రీట్‌మెంట్స్ బ్యూటీ స్పాలలో చేయించుకుంటారు. దీనికి కూడా ముందు సరైన కౌన్సెలింగ్ అవసరం. ఒక్కో వ్యక్తి చర్మ తత్త్వం ఒక్కో విధంగా ఉంటుంది. ఈ విధానంలో చర్మం రికవరీ అవడానికి కూడా సమయం పడుతుంది.

ఇంజక్షన్లు సరైనవేనా...

కృత్రిమంగా కొలాజన్, స్కిన్ బూస్టర్స్.. అని తీసుకుంటున్నారు. ఎవరో చెప్పారని కొంతమంది నర్సులను ఇంటికి పిలిపించుకొని ఇంజక్షన్లు చేయించుకుంటారు. మంచి లుక్ కోసం ట్రై చేయచ్చు. కానీ, వాటి డోసుల్లో తేడాలొస్తే మొత్తం తిరగబడుతుంది.

ఆన్‌లైన్‌లో చూసి ...

సోషల్ మీడియా ప్రభావం వల్ల ఆన్‌లైన్‌లో బ్యూటీ ఉత్పత్తులు తెప్పించుకొని, అప్లై చేసుకోవడం చూస్తుంటాం. వాటి వల్ల ఇబ్బందుల పాలైన వారు చాలా మంది ఉంటారు. ఎందుకంటే, అవి వారికి ఎంత వరకు నప్పుతాయో తెలియదు.

కెమికల్ పీలింగ్

కెమికల్ పీల్‌లో బయటి నుంచి చర్మంలోకి ఎలాంటి రసాయనాలు చొప్పించరు. మృతకణాలను తొలగిస్తారు, చర్మం పై పొర నుండి టానింగ్, పిగ్మెంటేషన్ తగ్గి కొత్త పొర కనిపిస్తుంది. అయితే, దీని ద్వారా చర్మంపై కొత్త సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. నిపుణుల సలహా అవసరం. ఇంకొన్ని పీఆర్‌పీ చికిత్సలు చర్మ నిగారింపును తీసుకువస్తాయి. అయితే, వధువులు కాబోయే అమ్మాయిలు పెళ్లికి 3 నుండి 6 నెలల ముందు ఈ కాస్మెటిక్ విధానాలను ప్రారంభించాలి. ఎందుకంటే వారి సిట్టింగ్‌లలో కనీసం 3 వారాల గ్యాప్ ఉండాలి.

లైటర్ టోన్‌లకు డిమాండ్

పెళ్లి చేసుకోబోయే అమ్మాయిలు తమ ప్రీ–బ్రైడల్ విధానంలో రంగు ఫెయిర్‌గా మారడం పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. నిజానికి, సూర్యకిరణాల నుండి మన చర్మాన్ని మనం రక్షించుకోనప్పుడు, చర్మంలో పాచెస్ ఏర్పడతాయి. కొన్నిసార్లు సూర్యకాంతి కుడి వైపున, మరి కొన్నిసార్లు ఎడమ వైపున ఎక్కువగా పడుతుంది. సూర్యుని అతినీలలోహిత కిరణాలు చర్మ కణాలను దెబ్బతీస్తాయి. పిగ్మెంటేషన్‌ను ప్రేరేపిస్తాయి. దీంతో అంతటా 'చర్మపు రంగు' ఒకే విధంగా ఉండదు. అంటే ముఖం మీద చాలా చోట్ల టాన్ ఉంటుంది. ఈవెన్ టోన్‌ని కలిగి ఉండాలంటే ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు ముఖంపై సన్‌స్క్రీన్‌ని అప్లై చేయడం చాలా ముఖ్యం.

కాస్మెటిక్ ఫిల్లర్స్...

నిఖిత పెదవులు చాలా సన్నగా ఉంటాయి. రంగు చాలా తక్కువ. ఒకరోజు ఆమె కాబోయే అత్తగారు ఫోన్ చేసి 'నీ ముఖంలో పెదవులు కనిపించడం లేదు. ఏదైనా చికిత్స తీసుకో' అంది. దీంతో నిఖిత నర్సులను కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లను ఆశ్రయించింది. దీనిని లిప్ ఫిల్లర్ అని కూడా అంటారు. దీర్ఘకాలిక ఫలితాల కోసం, ప్రతి 6 నుండి 8 నెలలకు ఇంజెక్షన్లు చేయాలి. కాస్మెటిక్ ఫేషియల్ ఫిల్లర్లే కాకుండా, హైలురానిక్ యాసిడ్ ఫిల్లర్ ఇంజక్షన్లు కూడా ఈ రోజుల్లో బాగా ప్రాచుర్యం పొందాయి. ఈ డెర్మా ఫిల్లర్‌లతో పెదవులు హైడ్రేటెడ్‌గా ఉంటాయి. పగుళ్లు రావు, పూర్తి పరిమాణంలో కనిపిస్తాయి. అలాగే, కొందరు అమ్మాయిలు అత్తింటి వారు బరువు తగ్గమన్నారు కదా అని లైపోసక్షన్ వంటి చికిత్సలు చేయించుకుంటారు. దీని వల్ల చర్మంపై చారలు ఏర్పడతాయి. అవి అంత త్వరగా పోవు. ముక్కు, పెదాలు, బ్రెస్ట్ సరిచేసుకోవడానికి కాస్మెటిక్ సర్జరీలు కూడా చేయించుకుంటారు. ఏ చికిత్స అయినా కనీసం ఆరు నెలల ముందు చేయించుకుంటే వచ్చే సైడ్‌ఎఫెక్ట్‌నూ నివారించవచ్చు.

సహజమైన మెరుపే మేలు



డాక్టర్ స్వప్నప్రియ
సీనియర్ దర్మటాలజిస్ట్

పెళ్లి 10–15 రోజులు ఉందనగా ఏ బ్యూటీ ట్రీట్‌మెంట్ చేయించుకోకూడదనే విషయం ముందు గ్రహించాలి. కనీసం ఆరు లేదా మూడు నెలల ముందు బ్యూటీ చికిత్సలు చేయించుకోవచ్చు. దీని ద్వారా సైడ్ ఎఫెక్ట్స్ ఉంటే నివారించుకునే అవకాశం ఉంటుంది. కృత్రిమ అందాన్ని ఎవరూ ఇష్టపడరు. ఎప్పుడైనా సహజమైన మెరుపును ఇచ్చే బ్యూటీ ట్రీట్‌మెంట్ మాత్రమే మంచిదని గమనించాలి. అయినా తప్పదు అనుకునేవారు స్కిన్ బూస్టర్స్, ఇతర ట్రీట్‌మెంట్ వైపుగా వెళ్లచ్చు. ఇందుకు నిపుణుల పర్యవేక్షణ అవసరం.

టిప్

డ్రై ఫ్రూట్స్ గిఫ్ట్ ఇస్తున్నారా?



దీపావళికి డ్రైఫ్రూట్స్‌ను గిఫ్ట్‌గా ఇస్తుంటారు చాలామంది. అయితే డ్రైఫ్రూట్స్‌ను కొనేటప్పుడు కచ్చితంగా ఇవి గమనించుకోవాలి. ● నట్స్ రంగు ఎలా ఉందో చూడాలి. సహజంగా ఉండాల్సిన దానికంటే మరింత ముదురు రంగులో ఉంటే అవి పాడైనట్టు. రుచిగా కూడా ఉండవు కాబట్టి కొనకపోవడమే మంచిది. ● వీలైతే ఒకటి రెండు నట్స్‌ను నీటిలో వేసి, పదినిమిషాల తరువాత కొరికి చూడాలి. నానిన తరువాత కూడా గట్టిగా ఉంటే అవి చాలా పాతవి. ఇవి ఆరోగ్యానికి అంత మంచిది కాదు కాబట్టి తీసుకోకూడదు. చాలా షాపులు తినడానికి శాంపిల్స్ ఇవ్వవు. ఇలాంటప్పుడు ఆ డ్రైఫ్రూట్స్‌ను తక్కువ పరిమాణంలో కొనుక్కుని పరిశీలించాలి ● నట్స్‌ని వాసన చూడాలి. ఘాటైన వాసన వస్తే అవి చాలా పాతవి. వీటికి కొద్దిగా తేమ తగిలితే వెంటనే బూజు పట్టి త్వరగా పాడవుతాయి. ఇవి తినడం ఆరోగ్యానికి మంచిది కాదు ● నట్స్ ప్యాకెట్ మీద ఎఫ్ఎస్ఎస్ఏఐ ముద్ర, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో చూడాలి. ఎప్పుడు ప్యాకింగ్ అయ్యింది? ఎప్పటిలోగా తినాలో సూచించే డేట్స్‌ను సరిగా చూసుకోవాలి. ఈ డేట్స్ ముద్రించని ప్యాకెట్స్‌ను కొనకూడదు ● ప్యాకెట్ మీద ముద్రించిన సమాచారాన్ని జాగ్రత్తగా చదవాలి. ప్రిజర్వేటివ్‌లు కలిపిన నట్స్‌ను కొనకపోవడమే మంచిది.

ఖుషీతో దిల్ ఖుష్



చిన్నతనంలో తాము పడ్డ కష్టాలు తమ పిల్లలు పడకూడదని వారికి నొప్పి తెలియకుండా ఎంతో కష్టపడి పెంచుతారు తల్లిదండ్రులు. అయితే లక్నోకు చెందిన ఖుషీ అందుకు భిన్నం. తన తండ్రిలా మరెవరూ కష్టపడకూడదని తానే ఓ సామాజిక కార్యకర్తగా మారి సాటి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది ఖుషీ పాండే.

లక్నోకు చెందిన 23 ఏళ్ల ఖుషీ పాండే బాల్యం ఉన్నావ్ అనే ఊళ్లో గడిచింది. తన తండ్రి నుంచి చిన్ననాటి విషయాలను క్షుణ్ణంగా తెలుసుకుంది. ఖుషీ తండ్రికి బాగా చదువుకోవాలని ఉండేది. కానీ పెన్సిల్ కొనే స్థోమత కూడా లేదప్పుడు. ఈ విషయం తెలుసుకుని, నాన్నలా మరెవరూ చదువుకోసం ఇబ్బంది పడకూడదు అనుకుంది. నిరుపేదలకు సాయం చేయాలని చిన్నప్పుడే గట్టిగా నిర్ణయించుకుంది.

ఖుషీ పెద్దయ్యేసరికి నాన్న వాళ్ల లక్నోకి మకాం మార్చారు. అక్కడ ఓ షాపులో పనిచేస్తూ తరువాత కాంట్రాక్టర్‌గా మారారు. ప్రభుత్వానికి సంబంధించిన ప్రాజెక్టులు కూడా రావడంతో ఖుషీ కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయి. దీంతో ఖుషీ 'లా' పూర్తయ్యాక, సోషల్ వర్క్‌లో పీజీ చేసింది. చదువు పూర్తయ్యాక వెంటనే నిరుపేదలకు చదువు చెప్పడం ప్రారంభించింది. మురికివాడల్లోని పిల్లలను ఒక చెట్టుకింద కూర్చోబెట్టి సాయంత్రం రెండుమూడు గంటలు చదువు చెప్పేది. రోజుకి యాభై మంది వరకు ఖుషీ క్లాసులకు హాజరయ్యేవారు. తన దగ్గరకు వచ్చే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడంతోపాటు, వారి తల్లిదండ్రులకు చదువు ప్రాముఖ్యతను వివరిస్తోంది.

తాతయ్య మరణంతో...

అది 2020 ... ఒకరోజు రాత్రి ఖుషీ వాళ్ల తాతయ్య షాపు నుంచి తిరిగి వస్తున్నారు. చీకట్లో సరిగా కనిపించక ఎదురుగా వచ్చే కారు తాతయ్య సైకిల్‌ని ఢీ కొట్టడంతో ఖుషీ తాతగారు అక్కడికక్కడే చనిపోయారు. తాతయ్యను ఎంతో ఇష్టపడే ఖుషీ ఈ చేదు సంఘటనను తట్టుకోలేకపోయింది. సైకిల్‌కు లైట్ ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు అనుకుని ప్రతి సైకిల్‌కు లైటు ఉండాలని భావించింది. రోజూ కూలి పనిచేసుకునేవారు తమ సైకిళ్లకు లైట్లు పెట్టుకోవడానికి తగ్గ స్థోమత ఉండేది కాదు. దాంతో వాళ్లకు ఒక్కొక్కరికి 350 రూపాయల ఖరీదు చేసే లైట్లను ఉచితంగా పంచింది. ఇలా ఇప్పటిదాకా 1500 మంది వాహనాలకు బ్యాటరీతో నడిచే లైట్లను అమర్చింది. లైట్లు అమర్చడానికి 'ఇన్‌స్టాల్ లైట్స్ ఆన్ బైస్కిల్' అని రాసిన ఉన్న ప్లకార్డు పట్టుకుని వీధుల్లో తిరుగుతూ ఎంతోమందికి అవగాహన కల్పించింది. అప్పట్లో ఖుషీ చేసిన ఈ పనిని ఓ ఐఏఎస్ అధికారి వీడియో తీసి సోషల్ మీడియాలో షేర్ చేయడంతో తెగ వైరల్ అయ్యింది. ఈ విషయం తెలిసిన ఎనభైమంది యువకులు ఖుషీతో కలిసి సైకిళ్లు, ట్రక్కులకు, ఇతర వాహనాలకు లైట్లు అమర్చడంలో ఖుషీకి సాయంగా నిలిచారు.





పాఠాలతో పైసలు సంపాదించి...

ఖుషీ చేస్తోన్న సామాజిక కార్యక్రమాలకు నిధులు చాలా కావాలి. ఇందుకు తన తండ్రి, బంధువులు సమకూర్చిన మొత్తం ఏమాత్రం సరిపోలేదు. దాంతో యూట్యూబ్‌లో 'లా' తరగతులు చెప్పడంతోపాటు, ఇతర పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేస్తూ నెలకు అరవై నుంచి డెబ్బై వేల వరకు సంపాదించి సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతోంది.

మహిళలకు అండగా...

బాలికలకు శానిటరీ ప్యాడ్ ల గురించి అవగాహన కల్పించడం, విద్యుత్ సదుపాయం లేని వారికి సోలార్ ల్యాంప్స్ అందించడం, 'జీవిక సాథీ' ప్రాజెక్టు పేరుతో దివ్యాంగ మహిళలు, వితంతువులు, ఒంటరి మహిళలకు కుట్టు మిషన్, జ్యూవెలరీ తయారీలో శిక్షణ ఇప్పించి వారి కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయడం వంటి సేవా కార్యక్రమాలతో ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తోంది.

దుర్గ ఇండియా



ప్రతి స్త్రీ దుర్గ వలే...

ప్రతి స్త్రీలో ఒక దుర్గ ఉంటుంది. కాని ఆ దుర్గను అదిమి పెట్టేలా కుటుంబం, సమాజం ఆమెను తీర్చి దిద్దుతాయి. దాంతో తన మీద ఏ అన్యాయం జరిగినా చెప్పలేని స్థితికి చేరుతుంది. 'నువ్వు దుర్గవి. పోరాడు' అని చెప్తారు బెంగళూరులోని 'దుర్గ ఇండియా' టీమ్ సభ్యులు. ప్రియా వరదరాజన్ అనే యాక్టివిస్ట్ ఏర్పాటు చేసిన ఈ గ్రూప్ స్త్రీలను కుటుంబ హింస నుంచి... లైంగిక వేధింపుల నుంచి కాపాడటానికి పని చేస్తోంది. వారి పోరాటానికి శక్తినిస్తోంది.

'ప్రతి ఒక్కరూ మార్పు కోసం ఎదురు చూస్తారు. మనమే మార్పు కోసం ప్రయత్నిద్దామని ఎందుకు అనుకోరు... ఎదురు చూస్తూ కూచుంటే మార్పు వస్తుందా?' అంటారు ప్రియా వరదరాజన్.

బెంగళూరులో 'దుర్గ ఇండియా' అనే సంస్థ స్థాపించి స్త్రీల సమస్యలపై పని చేస్తున్న ప్రియ ఇటీవల బెంగళూరు మాల్‌లో ఒక వ్యక్తి స్త్రీలను అసభ్యంగా తాకడం గురించి ప్రస్తావిస్తూ 'పబ్లిక్ ప్లేసుల్లో– బహిరంగ ప్రదేశాల్లో గాని ఆన్‌లైన్‌లోగాని స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలిగిస్తే అలాంటి వారిపై చర్య తీసుకునేందుకు ఆ బాధిత మహిళకు అండగా నిలవడం మేము చేసే పని. చట్టాలు ఎన్ని ఉన్నా, పోలీసులు, మహిళా పోలీసులు ఎందరు ఉన్నా మహిళలకు సాటి మహిళ అండగా ఉంటే కలిగే ధైర్యం వేరు. తోటి మహిళలతో వారు చెప్పుకునేవి వేరు. అలాంటి వారికి యోగ్యులైన కౌన్సెలర్లతో కౌన్సెలింగ్ చేయించి దిలాసా ఇప్పిస్తాము. అంతే కాదు బాధితులను వెంటబెట్టుకొని– ఆ స్టేషన్‌కుపో ఈ స్టేషన్‌కు పో అనే బాధ లేకుండా బెంగళూరులో వన్ స్టాప్ సెంటర్స్‌లో ఫిర్యాదు చేయిస్తాము. తోడుగా మేమొస్తే బాధితులు ఫిర్యాదు చేయడానికి జంకరు. ఎటొచ్చీ వారికి తోడు నిలిచే స్త్రీల బృందాలు అన్నిచోట్లా ఉండాలి' అంటుంది ప్రియ.

ఐ యామ్ ఎవ్రి ఉమన్

పదేళ్ల క్రితం ప్రియా వరదరాజన్ 'ఐ యామ్ ఎవ్రి ఉమన్' పేరుతో ఒక బ్లాగ్ రాయడం మార్పు కోసం ఆమె వేసిన మొదటి అడుగు. ఆ బ్లాగ్‌కు క్రమంగా చాలామంది మహిళా ఫాలోయర్లు వచ్చారు. వారు తమ అనుభవాలను ప్రియతో పంచుకోసాగారు. 'అందరిదీ ఒకే కథ. అందరూ మరొక స్త్రీ లాంటి వారే అని నాకు అర్థమైంది. స్త్రీల కోసం పని చేయాల్సిన అవసరం తెలియజేసింది. స్త్రీల కోసం పని చేయడం అంటే వారి పట్ల భావజాలాన్ని మార్చడమే' అంటుంది ప్రియ.

మగాడు ఎందుకు అలా చేస్తాడు?

'గతంలో సమాజంలో స్త్రీలకు ఏదైనా సమస్య వచ్చి ఆమె బయటకు చెప్పినప్పుడు– ఆమెలో ఏ దోషం ఉందో అన్నట్టుగా నిందను ఆమె మీదే వేసేవారు ఉండేవారు. వారి భావజాలాన్ని మార్చడమే చేయవలసింది. స్త్రీకి ఏదైనా అన్యాయం జరిగినప్పుడు ఆ మగాడు ఆమెతో అలా ఎందుకు చేశాడు అని ఆలోచించేలా చేస్తే సగం మార్పు వచ్చినట్టే. ఇంట్లో, వీధిలో, ఆఫీసులో స్త్రీలు ఆత్మాభిమానంతో ఉండాలంటే మగాళ్లు మారాలి. అందుకు ఒక రోజు సరిపోదు. ఒకరు పని చేస్తే సరిపోదు. ప్రతి ఒక్కరం ఏదో ఒక మేరకు పని చేయాల్సిందే' అంటుంది ప్రియ.



అందరినీ 'దుర్గ'లుగా మారుస్తూ

అన్యాయం జరిగితే వెరవకుండా ప్రతిఘటించమని ప్రియ ఆధ్వర్యంలో 'దుర్గల' బృందం చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. స్కూళ్లలో, కాలేజీలలో, బస్తీలలో తిరుగుతూ స్త్రీలకు తమ హక్కులను, చట్టపరమైన రక్షణను, సహాయం చేసే బృందాలను తెలుపుతుంది. 'నేను ఒంటరిదాన్ని కాను అని స్త్రీ అనుకుంటే చాలు... ఆమె పోరాడగలదు' అంటుంది ప్రియ.

ఇంత ప్రయత్నం చేసే ప్రియ లాంటి వారి సంఖ్య ఎంత పెరిగితే దుర్గలకు అంత శక్తి పెరుగుతుంది.

ఫస్ట్ టైమ్

మంత్రముగ్ధులను చేసే దాస్తాంగోయి



● ఫౌజియా

'దాస్తాంగో ప్రదర్శన ఇస్తున్నది ఓ అమ్మాయా!!' అని బోలెడు ఆశ్చర్యపడుతూనే ప్రేక్షకుల మధ్య కూర్చున్నాడు ఒక ప్రేక్షకుడు. ఇలా కూర్చొని అలా వెళ్లిపోదాం... అనుకున్నాడు. అయితే ప్రదర్శన పూర్తయ్యే వరకు కదలకుండా కూర్చున్నాడు.

ఆ హాల్‌లో నవ్వుల్లో నవ్వు అయ్యాడు. ఏడుపులో ఏడుపు అయ్యాడు. సకల భావోద్వేగాల సమ్మేళనంతో 'దాస్తాంగోయి' ఫౌజియాను ఆశీర్వదించాడు. ఉర్దూలో మౌఖిక కథాసాహిత్య కళారూపం... దాస్తాంగో.

పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ కళారూపంలో అపారమైన పేరు తెచ్చుకొని 'ఫస్ట్ ఫిమేల్ దస్తాంగోయి'గా గుర్తింపు పొందింది ఫౌజియా...

ఢిల్లీకి చెందిన ఫౌజియాకు స్కూల్ రోజుల నుంచి సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలు అంటే ఇష్టం. స్కూల్లో ప్రదర్శించే నాటకాల్లో పాల్గొనేది. ఫౌజియా తండ్రి మోటర్‌బైక్ మెకానిక్. ఆర్థిక పరిస్థితి రీత్యా ఫౌజియా ఎప్పుడో చదువు మానేయాలి. ట్యూషన్‌లు చెప్పగా వచ్చిన డబ్బుతో పై చదువులు చదివింది. మాస్ కమ్యూనికేషన్‌లో డిగ్రీ చేసింది.

దయాల్ సింగ్ కాలేజీలో చదువుకునే రోజుల్లో ఒకరోజు తొలిసారిగా 'దాస్తాంగో' ప్రదర్శన చూసింది ఫౌజియా. ఇక అప్పటి నుంచి 'దాస్తాంగో'పై ఆసక్తి, అభిమానం పెరిగాయి. తాను కూడా 'దాస్తాంగోయి'గా పేరు తెచ్చుకోవాలనుకుంది. 'ఇది పురుషులకు మాత్రమే పరిమితమైన కళారూపం. మహిళలు చేయలేరు. ఒకవేళ చేసినా ప్రేక్షకులు ఆదరించరు' అన్నట్లుగా చాలామంది మాట్లాడారు.

ఆ మాటలు విని ఫౌజియా కొంచెం కూడా నిరాశపడలేదు. తనపై తనకు గట్టి నమ్మకం ఉంది.

'జీవితాంతం దాస్తాంగోచెంతనే ఉండాలనుకున్నాను. ఎంతో చరిత్ర ఉన్న ఈ కళ గురించి ఈ తరంలో కొద్దిమందికి మాత్రమే తెలుసు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ తరానికి కూడా తెలిసేలా దాస్తాంగోకు ప్రాచుర్యం తీసుకురావాలనుకున్నాను' అంటుంది ఫౌజియా.

డానిష్ హుస్సేన్, మహ్మద్ ఫారూఖీ లాంటి గొప్ప కళాకారుల నుంచి 'దాస్తాంగో'ను నేర్చుకుంది ఫౌజియా. ఫౌజియా కథాసంవిధానంలో కృత్రిమమైన భాషా గాంభీర్యం వినిపించదు. పాత ఢిల్లీ యాస మాత్రమే వినిపిస్తుంది.

'మన దేశంలో ఎన్నో భాషలకు సంబంధించి ఎన్నో మాండలికాలు ఉన్నాయి. ప్రతి మాండలికానికి తనదైన సొగసు ఉంటుంది. ఈతరంలో చాలామంది తమ యాసను దాచి పెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఇది సరి కాదు. మన ఊరు, తల్లిదండ్రులు, సంస్కృతి గురించి గొప్పగా చెప్పుకున్నట్లే మన మాండలికం గురించి కూడా గొప్పగా చెప్పుకోవాలి' అంటుంది ఫౌజియా.

ఫౌజియాకు పుస్తకాలు చదవడం అంటే ఇష్టం. ముఖ్యంగా ఉర్దూ సాహిత్యం. చిన్నప్పుడు అమ్మ, అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు...'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.

జానపద కథలు మాత్రమే కాకుండా సామాజిక సందేశం ఉన్న ఆధునిక కథలను కూడా చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది ఫౌజియా. దేశవిభజన సమయంలో మహిళలు ఎదుర్కొన్న సమస్యలు, హింస గురించి కథగా చెబుతున్నప్పుడు ప్రేక్షకులు కదిలిపోయారు. కోవిడ్ కల్లోల సమయంలో ఫౌజియాకు 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వడానికి కుదరలేదు. దీంతో ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారానే ప్రదర్శన ఇచ్చింది.

అమ్మమ్మ, నానమ్మల నుంచి ఎన్నో కథలు విన్నది. అద్భుతమైన రీతిలో కథలు చెప్పేవారు. కథను ఎక్కడ మొదలు పెట్టాలి, ఎక్కడ విరామం ఇవ్వాలి, మళ్లీ ఎక్కడ మొదలు పెట్టాలి... అనే దాంట్లో వారు సిద్ధహస్తులు. ఆ మెళకువలు ఊరకే పోలేదు... 'దాస్తాంగో'లో ఫౌజియాకు బాగా ఉపకరించాయి.



మహాభారతం కథల నుంచి స్వాతంత్ర్యం కోసం మహాత్ముడి పోరాటం వరకు 'దాస్తాంగోయి'గా ప్రేక్షకులను మెప్పిస్తున్న ఫౌజియాకు ఉర్దూ భాషలోనే కాదు హిందీ, ఇతర భాషలలోనూ 'దాస్తాంగో' ప్రదర్శనలు ఇవ్వాలనేది కల. ఆమె కల నెరవేరాలని ఆశిద్దాం.